భారీ వర్షం.. బేజారైన జనం

అంజయ్యనగర్‌లో పిడుగు పాటు


పిడుగుపడి ధ్వంసమైన పిట్టగోడ

హైదర్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళవారం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి అంజయ్యనగర్‌లోని ఓ ఇంటిపై పిడుగుపడడంతో పిట్టగోడ పాక్షికంగా ధ్వంసమయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్యనగర్ రోడ్‌నెంబర్ 24లో మధుసాగర్ అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటుంది. మంగళవారం వేకువఝామున ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి మధుసాగర్ ఇంటిపై నుండి భారీ శబ్దం వినిపించింది. వెంటనే ఇంట్లోని విద్యుత్ స్విచ్ బోర్డులు, కరెంటువైర్లు దహనం అయ్యాయి. తర్వాత పైకి వెళ్లిచూడగా పిట్ట గోడ పాక్షికంగా ధ్వంసం అయి ఉంది. పిడుగుపాటు వల్ల భారీ శబ్దంతో పిట్టగోడ ధ్వంసం కావడంతో పాటు కరెంటు వైర్లు కాలిపోయాయని స్థానికులు అనుమానిస్తున్నారు. పిడుగు పాటు తీవ్రత తక్కువగా ఉండటంతో నష్టం స్వల్పంగానే ఉందని యజమానులు తెలిపారు.

చందానగర్ సర్కిల్ ఏసీపీ, ఏఎంహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

చందానగర్: చందానగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఏసీపీగా నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓగా డాక్టర్ రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ మున్సిపల్‌లో ఏసీపీగా విధులు నిర్వహించిన నాగిరెడ్డి బదిలీపై చందానగర్‌కు వచ్చారు.

కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలి : ఈటల


కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీ రాజేందర్

జీడిమెట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి జగద్గిరిగుట్ట నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులోని కల్వర్టు ప్రాంతంలో నీళ్ల ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఈటల రాజేందర్ ఆ కల్వర్టు ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం జడ్సీతో ఫోన్‌లో మాట్లాడి బ్రిడ్జి నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గాజుల రామారం కార్పొరేటర్ శేషగిరి, మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, బీజేవైఎం కో-కన్వీనర్ శ్యామ్‌కిరణ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముద్దాపురం మదన్‌గౌడ్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

షాపూర్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని బాలాజీ స్పోర్ట్స్ డ్రెసెస్ కంపెనీలో పని చేస్తున్న 22 మంది మహిళా కార్మికులు కంపెనీ బంద్ చేయడం వల్ల రోడ్డున పడ్డారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులందరూ కలిసి శ్రమశక్తి అవార్డు గ్రహీత, రాష్ట్ర కార్మిక నాయకుడు ముద్దాపురం మదన్‌గౌడ్‌ను ఆశ్రయించారు. ఆయన యాజమాన్యాన్ని పిలిపించి, కార్మికులకు రావలిసినటువంటి జీతాలు ఇవ్వాలని యాజమాన్యాన్ని గట్టిగా నిలదీశారు. పలు మార్లు చర్చలు జరిపి రెండు నెలల సమయం తీసుకొని మంగళవారం కార్మికులకు 60 శాతం జీతాన్ని ఇప్పించారు. మిగినవి 24 అక్టోబర్ 20వ తేదీన ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు.

'ట్రైనీ డాక్టర్ కేసులో నిందితులకు ఉరిశిక్ష వేయాలి'

షాపూర్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ట్రైనీ వైద్యురాలు హత్య కేసులో జుడీషియల్ విచారణ చేయించి నిందితులకు ఉరిశిక్ష వేయాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్ గవర్నమెంట్ స్కూల్ వద్ద ఆయన మాట్లాడుతూ.. యువ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటన్నారు. నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మృతురాలు అభయ్‌కు న్యాయం చేయాలని మహిళలంతా ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రోడ్డుపై జారిపడ్డ ఇనుపచువ్వలు


రోడ్డుపై పడిన ఇనుపచువ్వలు

దుండిగల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సూరారం నుంచి గండిమైసమ్మకు ఇనుపచువ్వలతో వెళ్లే వాహనం నుంచి ఒక్కసారిగా అవి రోడ్డుపై పడిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి వాహనాలను క్లియర్ చేశారు. వాహనం నుంచి డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరుగలేదు.


కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీల నాయకులు

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని జీడిమెట్ల డివిజన్‌లోని 8 కాలనీల నాయకులు, అసోసియేషన్ సభ్యులు వెన్నెలగడ్డలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ప్లకార్డు చేత పట్టుకొని నిరసన చేపట్టారు. సాయిబాబానగర్ ఫీడర్ నుంచి సరఫరా జరిగే 8 కాలనీలో ప్రతీ రోజు దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ కోతలు ఉంటున్నాయని వాపోయారు. నిరసన తెలిపిన వారిలో ఎంఎన్‌రెడ్డి కాలనీ ఫేజ్-1 అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, న్యూవివేకానంద్ నగర్ మాజీ అధ్యక్షుడు సత్యయ్యగౌడ్, నాయకులు జ్ఞానేశ్వర్, ఎల్లగౌడ్, బలరామ్, పరమేష్, శంకరయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏఎల్‌లో ఎన్నికల సందడి

బాలానగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హిందుస్తాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)లో కార్మిక యూనియన్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధ్యక్షుడి ఎన్నిక(ఆగస్టు 30)న ఉండడంతో బరిలో నిలిచిన కార్మిక యూనియన్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని మరింత పెంచారు. కూటమిగా ఏర్పడిన హెచ్‌ఏడబ్ల్యూ, ఐఎన్‌టీయూసీ, ఈటీయూ, ఐఈయూ యూనియన్‌లు తమ అభ్యర్థి వెంకటాద్రి గెలుపు కోసం ప్రచారం ముమ్మరం చేశాయి. ఈ నెల 27న హెచ్‌ఏడబ్ల్యూ, 28న బీఎంఎస్ గేట్ మీటింగ్ నిర్వహించేదుకు యూనియన్లు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

కబ్జాల నుంచి పార్కులను కాపాడాలి


పార్కులో చేపడుతున్న నిర్మాణం

గచ్చిబౌలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ సఫారి నగర్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని వాటిని కాపాడాలని స్థానికులు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలనీలో ఉన్న రెండు పార్కుల్లో ఓ పార్కును వ్యాపారవేత్త వినాయక మండపం పేరుతో నిర్మాణం చేసి తన సొంతానికి వాడుకుంటున్నాడని వినతిపత్రంలో వివరించారు. తాజాగా మళ్లీ వినాయక చవితి వస్తున్న తరుణంలో మరో పార్కులో వినాయక మండపం పేరుతో నిర్మాణాలు చేస్తున్నాడని చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగంగౌడ్, కృష్ణ, కృష్ణముదిరాజ్, శేఖర్, రాములు, దశరథ్ పాల్గొన్నారు.


దీనదయాల్‌నగర్ బస్తీని సందర్శించిన ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ సతీష్‌గౌడ్

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలాలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మంగళవారం ఉదయం వాహనదారులు వరదనీటిలో ప్రయాణం చేస్తూ అవస్థలు పడ్డారు. వర్షం నీటితో పాటు మురుగునీరు కలిసి ఇళ్లను ముంచెత్తాయి. దీంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. వర్షాలకు రోడ్లపైకి రాళ్లు, రప్పలు చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వసంతనగర్, కేపీహెచ్‌బీ మూడోఫేజ్, నెక్సస్ మాల్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరడంతో పాటు ఇసుక పేరుకుపోయింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. నీటమునిగి బస్తీలను ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సందర్శించి ప్రజల సమస్యలను పరిశీలించారు.


శేరిలింగంపల్లి సర్కిల్ సుదర్శన్‌నగర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు


వాజపేయినగర్‌లో నిలిచిన నీటిలో బాలిక


కేపీహెచ్‌బీకాలనీ నెక్సస్ మాల్ చౌరస్తాలో ఇంటిలోకి చేరిన వర్షం నీటిని ఎత్తుతున్న మహిళ


కుత్బుల్లాపూర్ వాజ్‌పేయి నగర్ కాలనీలో మోకాలి లోతు నిలిచిన వర్షపు నీరు


దుండిగల్‌లో రోడ్డుపై నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ


కూకట్‌పల్లిలోని కల్యాణ్‌నగర్‌లో..


కూకట్‌పల్లిలో నీట మునిగిన ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సందర్శించిన కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి


కూకట్‌పల్లి సమతానగర్‌లో నిలిచిపోయిన వర్షం నీరు


బాలానగర్ నవజీవన్‌నగర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నిరసన తెలుపుతున్న టీజీయూఈఈయూ నాయకులు

ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఇవ్వాలని ధర్నా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఐదేళ్లు పూర్తయిన ఆర్టిజన్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఈఈయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టిజన్లు ఖైరతాబాద్ దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు మింట్‌కాంపౌండ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్దన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీగా మింట్‌కాంపౌండ్ చౌరస్తా నుంచి దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కార్మికులను పై గ్రేడ్‌కు ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో ఆర్టిజన్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.శ్రీను ముదిరాజ్

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలి

తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీను

పంజాగుట్ట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో చెరువులు, కుంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీను ముదిరాజ్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, దానిని నడిపిస్తున్న కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం, శివారు ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురి అవుతున్నాయని, అందులో బహుళ అంతస్తుల భవనాలు, ఫామ్ హౌస్‌లు వెలిశాయని అన్నారు. చెరువులు, కుంటలను రక్షించడానికి, సహజ వనరులను కాపాడడానికి ప్రత్యేక అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఏర్పాటు చేసిన కొన్ని రోజుల్లోనే చెరువులు, కుంటల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిందని అన్నారు. సీఎం చొరవతో ఏర్పాటు అయిన హైడ్రాతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికారప్రతినిధి గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, ఉప్పరవేని రంజిత్ ముదిరాజ్, ఎస్.మహేష్, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేము

మాజీ ప్రధానమంత్రి దివంగత నేత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను మరువలేమని నాయకులు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాలోని పలు కాలనీలు, బస్తీలు, పార్టీ కార్యాలయాల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలకు, పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


గాజులరామారంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్, నాయకులు


కేపీహెచ్‌బీలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బండి రమేష్, శేరి సతీష్‌రెడ్డి తదితరులు


బాలానగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు


మియాపూర్ గంగారంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ జైపాల్


హైదర్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు

'కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి'

బంజారాహిల్స్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మెడికల్ విద్యార్థినిపై ఇటీవల జరిగిన అత్యాచార, హత్య ఘటనను అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ఆరిజన్(ఏఏపీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కత్తుల ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండిరచారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానన్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో డాక్టర్లకు తగినంత భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోర్టు ముందు రెండోరోజూ న్యాయవాదుల నిరసన

కేపీహెచ్‌బీకాలనీ: ఎస్సైపై చర్యలు తీసుకోకుండా న్యాయవాదినే తప్పుగా సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది న్యాయ న్యాయవ్యవస్థపై దాడి చేయడమేనని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ మేరకు బోరబండ పోలీసుల తీరును నిరసిస్తూ కూకట్‌పల్లి న్యూ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండోరోజూ మంగళవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. సదరు ఎస్సైపై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని వాపోయారు.

ప్రతి కాలనీలో సీసీ రోడ్లు నిర్మిస్తాం: కార్పొరేటర్ దొడ్ల

హైదర్‌నగర్: మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రతి కాలనీలో సీసీరోడ్లు నిర్మిస్తామని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్‌లో కాలనీలో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల మట్టివేయాలని సూచించారు.


శ్రీనివాసుడు

ముగిసిన పవిత్రోత్సవాలు

భెల్‌కాలనీ: బెల్‌టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం నిర్వహించిన పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో ఉత్సవాలు ముగిశాయి. మూలవిగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు.

వరదనీటి నివారణ చర్యలు చేపట్టాలి: జడ్సీ

గచ్చిబౌలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో వరద నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపునీరు రోడ్లపై చేరడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. మాదాపూర్‌లోని నెక్టార్‌గార్డెన్, బయోడైవర్సిటీ, సుదర్శనగర్, లింగంపల్లి తదితర కాలనీల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదనీటి నివారణ చర్యలు వెంటనే చేట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. మురుగు, వరదనీటి కాల్వల్లో వ్యర్థాలను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఇంజనీర్లు రమేష్, రజిత పాల్గొన్నారు.


అధిరారులకు సూచనలు చేస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి